క్లుప్తంగా

ఆర్టీసీ స్థలాన్ని ఆక్రమించడం దుర్మార్గం


మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ వేదాంత ప్రభాకర్

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఆర్టీసీ స్థలాన్ని అక్రమించుకోవాలని అనుకోవటం దుర్మార్గమని మాజీ ఎంపీపీ వేదాంత ప్రభాకర్ మండిపడ్డారు. మంగళవారం ఆర్టీసీ స్థలాన్ని కొలతలు వేసేందుకు వచ్చిన రోడ్లు,భవనాల శాఖ, ఆర్టీసీ, రెవెన్యూ అధికారులను మండలానికి చెందిన నాయకులతో కలిసి ఆయన అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని రోడ్లు, భవనాల శాఖకు చెందిన స్థలాన్ని అధికారులు ఆర్టీసీ బస్టాండ్ కోసం కేటాయించారన్నారు. ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు మండలానికి చెందిన కొందరు ప్రయత్నిస్తున్నారన్నారు. గతంలో ఈ స్థలాన్ని కోర్టు ప్రభుత్వానికి చెందిన స్థలంగా తీర్పు ఇచ్చినట్లు గుర్తు చేశారు. తీర్పు అనంతరం రోడ్లు, భవనాల శాఖకు చెందిన అధికారులు స్థలాన్ని ఆర్టీసీకి అప్పజెప్పారని చెప్పారు. ప్రస్తుతం దూర ప్రాంతాలకు చెందిన ఎన్నో బస్సులు తిరుగుతూ ప్రజలకు ఉపయోగకరంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో కొందరు అధికారుల సాయంతో తిరిగి స్వాధీనం చేసుకొనేందుకు ప్రయత్నించటం దారుణమన్నారు. నాయకులు యక్కంటి మల్లారెడ్డి, ముత్తలూరి శివశంకరాచాకరి, దండా కాశిరెడ్డి, కోటిరెడ్డి పాల్గొన్నారు.

కూటమి కనికట్టు

- రైతుల నోట్లో మట్టి
- నిబంధనల పేరుతో రైతులకు అందని అన్నదాత సుఖీభవ
- 4,800 మంది రైతులకు అందని ద్రాక్షలా పథకం



కురిచేడు: ఎన్నికల ముందు రైతుల కోసం ఎన్నో పథకాలు ప్రవేశ పెడతామని చెప్పిన కూటమి నాయకులు ఎన్నికల అనంతరం ఏరుదాటి తెప్ప తగలేసినట్లు వ్యవహరిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో మండలంలోని రైతులందరికీ సకాలంలో రైతు భరోసా పథకం అంది అందరూ పెట్టుబడులు పెట్టుకుని పంటలు సాగు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు భరోసా పేరును అన్నదాత సుఖీభవగా మార్పు చేశారు. అంతే కాకుండా గతేడాది రైతులకు ఎగనామం పెట్టారు. ఈ ఏడాదైనా ఇస్తారేమో ఆశగా ఎదురు చూసిన అన్నదాతల నోట్లో మట్టికొట్టారు. గత ప్రభుత్వంలో మండలంలో 11,940 మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి పొందారు. కూటమి ప్రభుత్వం ఏం మాయ చేసిందోగానీ మండలంలో కేవలం 7,134 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించారు. వారికి రూ.5 వేలు ప్రకారం వారి ఖాతాల్లో జమ చేసింది. అవి కూడా రైతుల ఖాతాల్లో కాకుండా వారి కుటుంబాల్లో ఎవరో ఒకరి ఖాతాలో జమ చేసింది. అందులో వివాహాలైన ఆడపిల్లల ఖాతాల్లో కూడా జమ చేయడంతో అన్నదాతలు వారిని అడగ లేక, తమకు నగదు రాక సతమతమవుతున్నారు.

పంటల బీమా పేరుతో దోపిడీ

రైతులకు గత ప్రభుత్వం నయాపైసా కూడా తీసుకోకుండా ప్రతి రైతు పేరుపై పంటల బీమా పథకం చేయించింది. అందరికీ పంటల బీమా నగదు అందేలా చర్యలు తీసుకుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గతేడాది, ఈ ఏడాది రైతుల వద్ద నుంచి పంటల ప్రకారం బీమా రైతులే నగదు చెల్లించాలని ఆదేశించింది. గతేడాది పంటల బీమా పథకం ద్వారా లబ్ధి చేకూరకపోగా ఈ ఏడాది రైతులు ఆశతో తిరిగి పంటల బీమా కడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే ఐదు వేలకన్నా రైతులు చెల్లించే పంటల బీమా నగదు ఎక్కువగా ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులను నిలువునా మోసం చేశారు:



కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రైతులను నిలువునా మోసం చేశారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు లేదు. బీమా లేదు. పట్టించుకునే వారే లేకుండా పోయారు. రైతులకు అందించే పనిముట్లు, విత్తనాలు కూడా అధికారులు ముఖాలు చూసి ఇస్తున్నారు. రైతులకు మేలు జరగటం లేదు. జగనన్న ప్రభుత్వంలోనే రైతులకు మేలు చేకూరింది. ఆనందంగా ఉన్నాం.

– గాదె సుబ్బారెడ్డి, రైతు

ఇచ్చేదాని కన్నా తీసుకునేదే ఎక్కువైంది:



కూటమి ప్రభుత్వంలో రైతులకు ఇచ్చేదానికన్నా తీసుకునేది ఎక్కువైంది. అన్నదాత సుఖీభవ అన్నారు. దానికంటే అన్నదాత దుఃఖీభవ అంటే బాగుండేది. గతేడాది రైతులకు పెట్టుబడి సాయం లేదు. ఈ ఏడాది అరకొరగా ఇచ్చారు. వైఎస్సార్ ప్రభుత్వంలో రైతులకు అడగకుండానే ఇళ్ల వద్దకు వచ్చి పొలాలు ఆన్‌లైన్ చేసే వారు. పంటల బీమా కట్టేవారు. పంటలకు కూడా మంచి ధరలు వచ్చాయి. సకాలంలో రైతు భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గిట్టుబాటు లేకపోగా పథకాల పేరుతో రైతుల జేబులు ఖాళీ చేస్తున్నారు. చాలా మంది రైతులకు అన్నదాత సుఖీభవ రాలేదు.

– పి.చలమయ్య, రైతు

స్మార్టు మీటర్లు బిగించొద్దు


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దర్శి: రాష్ట్ర ప్రభుత్వం స్మార్టు మీటర్లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో దర్శి ఈఈ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేసి విద్యుత్ అధికారి షేక్ మహబూబ్‌బాషాకు డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా తాండవ రంగారావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం కార్పొరేట్ అదానీ కంపెనీతో విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఒప్పందం చేసుకుందని, ప్రస్తుత మీటర్లను తొలగించి అదానీ స్మార్ట్ మీటర్లు రాష్ట్రంలోని గృహాలకు బిగిస్తున్నారన్నారు. సింగిల్ ఫేజ్ మీటర్‌కు 9 వేల రూపాయలు, త్రీ ఫేజ్ మీటర్‌కు 17 వేల రూపాయలు రాబోవు 93 నెలల పాటు నెల నెలా బిల్లుతో పాటు అదనంగా డబ్బులు వసూలు చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. గృహ వినియోగదారులు వాడుకున్న విద్యుత్‌కు ఉదయం ఒక ధర, మధ్యాహ్నం ఒక ధర, రాత్రి ఒక ధర వసూలు చేస్తారని, ముందుగా డబ్బులు వేసుకుంటేనే కరెంటు ఉంటుందని, లేకుంటే చీకటిలో ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మీటర్లతో ప్రజల జేబుల్లో డబ్బులు కొల్లగొట్టి అదానీకి దోచిపెట్టేందుకు బీజేపీ, కూటమి ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని, ప్రజలందరూ అదానీ మీటర్లు బిగించకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రైతు సంఘ కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై టీడీపీ నాయకులు విషం కక్కారని, జగన్, అదానీ కుమ్మక్కై 1250 కోట్లు అవినీతి విద్యుత్ ఒప్పదంలో జరిగిందని, స్మార్టు మీటర్లు ప్రజలకు నష్టం అని, వాటిని బిగిస్తే పగలగొట్టాలని, హైకోర్టులో కేసులు వేసి ఇప్పుడు అదే స్మార్ట్ మీటర్లు బిగించడం దుర్మార్గం అన్నారు. ఇప్పటికే షాపులకు, ఆఫీసులకు, పరిశ్రమలకు స్మార్టు మీటర్లు బిగించడంతో గతంలో నెలకు 800 రూపాయలు వచ్చే బిల్లు ఇప్పుడు 1400 వస్తుందని ప్రజలు చెబుతున్నారని, స్మార్టు మీటర్లు రద్దు చేసే వరకు ప్రజా సంఘాలు నిర్వహించే ఆందోళనలకు గృహ యజమానులు, షాపులు, ఆఫీసుల వారు సహకరించి ఉద్యమంలో పాల్గొనాలని ఆయన కోరారు. సీపీఎం, సీఐటీయూ నాయకులు కేవీ పిచ్చయ్య, గోగు వెంకయ్య, కోమరగిరి కోటేశ్వరరావు, ఎం.యలమందారెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి


కరదీపికలతో రైతులు

దొనకొండ: రైతులు పొలాల్లో భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు, మందులు వాడుకోవాలని, అలా చేస్తే పంట దిగుబడి వచ్చే అవకాశం ఉందని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వి.శేషమ్మ తెలిపారు. మండలంలోని రుద్రసముద్రంలో జిల్లా వనరుల కేంద్రం ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన–2025 కింద ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల్లో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శేషమ్మ మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షల ఫలితంగానే ఎరువులు వాడుకోవాలని సూచించారు. కంది, మొక్కజొన్న, పత్తి, మిరప పంటల్లో విత్తనం వేసే దగ్గర నుంచి పంట కోత వరకు చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి, ఎరువుల ప్రాముఖ్యత గురించి వివరించారు. మండల వ్యవసాయధికారి వి.బాలకృష్ణనాయక్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో అమల్లో ఉన్న పథకాలు, విత్తన సరఫరా, క్రాఫ్ ఇన్సూరెన్స్, పంట నమోదు మొదలైన అంశాల గురించి వివరించారు. అనంతరం వివిధ పంటల్లో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి కర దీపికలు రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓలు నాగేశ్వరరావు, ఎంపీఏ రవితేజ, ఆత్మ బీటీఎం నాగభూషణం, రైతులు పాల్గొన్నారు.

గంగదేవిపల్లిలో..

గంగదేవిపల్లిలో రైతులకు ఆత్మ తరఫున పంటల్లో యాజమాన్య పద్ధతులు మండల వ్యవసాయాధికారి బాలకృష్ణనాయక్ రైతులకు వివరించారు. కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్ట్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పత్తి, కందిలో వచ్చే తెగుళ్లు, పురుగుల గురించి వివరించారు. నివారణ చర్యల గురించి రైతులకు తెలిపారు. పంటల బీమా కట్టుకునే రైతులు ఆగష్టు 14 వరకు అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది అనిల్, రైతులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కంపెనీల ఒప్పంద పత్రం తప్పనిసరి


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

పెద్దారవీడు: మొక్కజొన్న సాగు చేసిన రైతులు కంపెనీల నుంచి ఒప్పంద పత్రం తప్పనిసరిగా తీసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని బద్వీడు చెర్లోపల్లి రైతులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 250 ఎకరాల్లో పలు రకాల కంపెనీలకు చెందిన మొక్కజొన్న విత్తనోత్పత్తి కోసం నాటారని, రైతులు కంపెనీల నుంచి అగ్రిమెంట్ పత్రాలు తప్పనిసరిగా తీసుకొని భద్రపర్చుకోవాలని, లేకుంటే భవిష్యత్‌లో వచ్చే పరిమాణాలకు పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడి, ఎక్కువ ధర ఇస్తామని నోటి మాటలను నమ్మవద్దని, ఏ విషయమైనా అగ్రిమెంట్ పత్రం ద్వారా రాత పూర్వకంగా రాసి ఇవ్వాలని, ఆ విధంగా కంపెనీ వారితో మాట్లాడుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ, ఏఈఓ సునీల్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

విరామం ఎరుగని ఉపాధ్యాయుడు



పుల్లలచెరువు జెడ్పీ పాఠశాల


పాఠశాలలో హిందీ బోధిస్తున్న శ్రీనివాసరెడ్డి

- నాలుగు సబ్జెక్టులు బోధించేది ఒకే ఒక్కడు
- ఉదయం 9 నుంచి 4 గంటల వరకు క్లాసులకే పరిమితం
- పుల్లలచెరువు జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి

పుల్లలచెరువు: ప్రస్తుత విద్యాసంవత్సరంలో మండలంలోని పలు పాఠశాలల్లో బోధన చేసేందుకు ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. దీనికి తోడు మండలం జిల్లాకు వెనుకబడి ఉండటంతో ఇక్కడకు వచ్చి పనిచేసే ఉపాధ్యాయులు చాలా తక్కువగా ఉన్నారు. ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉండటంతో విద్యార్థులు చదువులో వెనుకబడి ఉండకూడదనే లక్ష్యంతో ఏకధాటిగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విరామం లేకుండా పిల్లల భవిష్యత్ తనకు ముఖ్యం అంటూ నిరంతర బోధన చేస్తున్నాడు పుల్లలచెరువు జెడ్పీ పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయుడు వై.శ్రీనివాసరెడ్డి.

బోధనంటే ఇష్టంతోనే..

మండల కేంద్రం పుల్లలచెరువు జెడ్పీ పాఠశాలలో 450 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టడంతో పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. పాఠశాలలో హెచ్‌ఎంతో కలుపుకుని మొత్తం నలుగురు ఉపాధ్యాయులు మాత్రమే పనిచేస్తున్నారు. ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వై.శ్రీనివాసరెడ్డి తను బోధన చేసే ఫిజిక్స్ కాకుండా ఉపాధ్యాయులు లేని ఎస్ఎస్, ఇంగ్లిష్, హిందీ సబెక్టులను కూడా అన్ని తరగతులకు మైక్ ఏర్పాటు చేసుకుని బోధిస్తున్నారు. ఇదే పాఠశాలలో దాదాపు 22 మంది ఉపాధ్యాయులు పనిచేయాల్సి ఉండగా నలుగురు మాత్రమే పనిచేస్తున్నారంటే విద్యార్థులకు చదువులు ఎలా వస్తాయో అధికారులే ఆలోచన చేయాలి. త్వరలో వచ్చే డీఎస్సీలోనైనా ఉపాధ్యాయులు ఇక్కడ నియమితులవుతారన్న నమ్మకం లేదు.

బదిలీపై వెళ్లినా విధులు ఇక్కడే

ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా శ్రీనివాసరెడ్డి బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లారు. కొత్తచోట విధుల్లో చేరారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు మళ్లీ పుల్లలచెరువు వచ్చారు. తనకు ఎందుకులే అనుకోకుండా తనకు వచ్చిన సబ్జెక్టులన్నీ శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు బోధిస్తున్నారు. ఇటు విద్యార్థులు, అటు గ్రామస్తులు ఆయన్ను అభినందిస్తున్నారు. ఇలాంటి ఆదర్శ ఉపాధ్యాయులు ఎక్కడున్నా విద్యార్థులకు మేలు జరుగుతుందనడంలో అతిశయోక్తి లేదు. తన జీతం తనకు వస్తే చాలనుకునే ఉపాధ్యాయులున్న ఈ రోజుల్లో అధిక సమయం కేటాయించి ఒకే ఉపాధ్యాయుడు నాలుగు సబ్జెక్టులు బోధించడం విశేషం.

దేవుడిలా వచ్చి పాఠాలు చెబుతున్నారు

నేను పదో తరగతి చదువుతున్నా. మాకు ఉపాధ్యాయుల కొరత ఉంది. సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు లేక పోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. విషయం తెలుసుకున్న శ్రీనివాసరెడ్డి సార్ మాకు నాలుగు సబ్జెక్టులు చెబుతున్నారు. అదే ఈ సార్ చెప్పకుంటే మా పరిస్థితి ఏంటి. మేమంతా సార్‌కు రుణపడి ఉంటాం. అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించాలి.

– వెంకటేశ్వర్లు, పదో తరగతి, పుల్లలచెరువు

నాకు టీచింగ్ అంటే చాలా ఇష్టం



నాకు ఉపాధ్యాయ వృత్తి అంటే చాలా ఇష్టం. నేను ఎంఎస్సీ బీఈడీ చేశా. నాకు అన్ని సబ్జెక్టులపై అవగాహన ఉంది. ప్రస్తుతం నేను పనిచేస్తున్న పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంది. విద్యార్థులకు బోధన చేసే వారు లేక నాకు తెలిసిన విద్యను నలుగురికి అందజేద్దాం అనే ఉద్దేశంతో బోధన చేస్తున్నా. అన్ని తరగతులకు నాలుగు సబ్జెక్టులను క్లాసుల వారీగా బోధిస్తున్నా.

– వై.శ్రీనివాసరెడ్డి, ఫిజిక్స్, జెడ్పీ స్కూల్, పుల్లలచెరువు

నేడు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సభ

పుల్లలచెరువు: మండల కేంద్రం పుల్లలచెరువు రైస్ మిల్ వద్ద బుధవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ సభ నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ హాజరవుతారని పేర్కొన్నారు. కార్యకర్తలు, అభిమానులు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన


సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

కురిచేడు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సమాచార హక్కు చట్టం గురించి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కేజీఎస్ రాజు, మండల విద్యాశాఖాధికారి ఆర్.వస్త్రాం నాయక్ వివరించారు. సమావేశానికి మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది హాజరయ్యారు. సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కలిగించకుండా కేవలం అధికారులు, సిబ్బందికి మాత్రమే అవగాహన కల్పించి మమ అనిపించారు. ప్రజలకు ఈ చట్టంపై అవగాహన కలిగిస్తే అధికారులు చేసే తప్పులు బయటపడతాయనే భయంతోనే అధికారులు ప్రజలకు తెలియకుండా సమావేశం నిర్వహించారని పలువురు విద్యావేత్తలు విమర్శిస్తున్నారు.

శ్మశానం పరిశీలన


మాట్లాడుతున్న తహసీల్దార్ బీవీ రమణారావు

తాళ్లూరు: మండలంలోని శివరామపురం సర్వే నంబర్ 70–16 లోని శ్మశాన స్థలాన్ని తహసీల్దార్ బీవీ రమణారావు మంగళవారం పరిశీలించారు. శ్మశాన స్థలానికి ఏర్పాటు చేసిన ప్రహరీని కూల్చివేశారని ఫిర్యాదు అందడంతో ఆయన సంఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. సర్వేయర్ దానియేల్, వీఆర్ఓ చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు సంజీవని వంటివి


మాట్లాడుతున్న వైద్యులు

దర్శి: తల్లిపాలు బిడ్డకు సంజీవని లాంటివని గైనకాలజిస్ట్ బాదం లక్ష్మీప్రసన్న అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శివరాజ్ నగర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య కార్యకరకర్తలు, నర్సులకు గైనకాలజిస్ట్ డాక్టర్ బాదం లక్ష్మీప్రసన్న, చిన్నపిల్లల వైద్యులు బి.సాయికుమార్‌రెడ్డిలతో అవగాహన సదస్సు నిర్వహించారు. లక్ష్మీ ప్రసన్న, సాయికుమార్‌రెడ్డిలు మాట్లాడుతూ గర్భిణిగా ఉన్నప్పటి నుంచే మంచి నాణ్యమైన పౌష్టికాహారం తింటే తదుపరి ప్రసవం తర్వాత కూడా తల్లి శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉంటుందని చెప్పారు. తల్లిపాలలో ఉత్తమ పోషక పదార్థాలు శిశువు ఎదుగుదలకు దోహదపడుతాయని తెలిపారు. తల్లికి జ్వర మొచ్చినా, ఎయిడ్స్ రోగి అయినా చంటి బిడ్డకు పాలివ్వడంలో అపోహలకు తావులేకుండా నిరభ్యంతరంగా ఇవ్వవచ్చన్నారు. మానవత సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాద్, సంస్థ నూతన అధ్యక్షుడు చీదెళ్ల బసవయ్య, డైరెక్టర్ కపురం శ్రీనివాసరెడ్డి, సలహాదారులు సుబ్బారావులు డాక్టర్లను ఘనంగా సత్కరించారు. హెచ్‌వీ సుహాసిని, సుశీలమ్మ పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంలకు ఆత్మీయ వీడ్కోలు

మద్దిపాడు: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన 15 మంది ఏఎన్‌ఎం లను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వైద్యులు శ్రావణ్, వినీల చౌదరి, జగదీష్‌బాబు, అవినాష్‌లు మాట్లాడుతూ మద్దిపాడులో ఇంతకాలం వైద్య సేవలు అందిస్తూ మంచి పేరు తీసుకొచ్చారని, బదిలీపై వెళ్లడం బాధాకరమన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసిన విధంగానే బదిలీపై వెళ్లిన చోట కూడా మంచి పేరు తెచ్చుకోవాలని వారు ఆకాంక్షించారు. నూతనంగా బదిలీపై వచ్చిన వారికి ఆహ్వానం పలుకుతూ ఆసుపత్రి పేరును నిలబెట్టాలని కోరారు. అనంతరం కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సిబ్బందికి స్వాగతం పలుకుతూ, బదిలీపై వెళ్తున్న వారిని ఘనంగా సన్మానించి వారికి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్లు రజిత కుమారి, లలితమ్మ, హెచ్వీలు నాగరాజు, సీతమ్మ, సూపర్వైజర్ బాలకోటయ్య, వైద్య శాఖ సిబ్బంది, హెచ్వీలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం పాటుపడిన జగనన్న

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్


ముస్లిం మైనార్టీ నాయకుడిని అభినందిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం పాటుపడ్డారని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. పార్టీ ముస్లిం మైనార్టీ మండల అధ్యక్షుడిగా నియమితులైన షేక్ మహ్మద్ ఖాశింను ఆయన మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న తన పదవీ కాలంలో ముస్లిం మైనార్టీలకు పెద్దపీట వేసి అనేక పదవులు కేటాయించారని, తన క్యాబినేట్‌లో ముస్లింలకు స్థానం కల్పించారని గుర్తు చేశారు. పార్టీ పిలుపు మేరకు జరిగే ప్రతి కార్యక్రమంలో ముస్లింలు పాల్గొనాలని ఆయన కోరారు. అనంతరం ముస్లిం మైనార్టీ నాయకులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు షేక్ కాశింపీరా, సయ్యద్ జబీవుల్లా, షేక్ ఫజుల్, షేక్ వలి, షేక్ హనీఫ్, షేక్ బాషా, ఎం.మహబూబ్‌బేగ్, సయ్యద్ ఉస్మాన్, షేక్ ఇస్మాయిల్, చోటు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తాటిపర్తిని విమర్శించటం సిగ్గుచేటు


సమావేశంలో మాట్లాడుతున్న కన్వీనర్ రమణారెడ్డి, పక్కన వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దదోర్నాల: ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ను టీడీపీ నాయకులు విమర్శించటం సిగ్గు చేటని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తన స్వగృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం గురించి మాట్లాడుతూ ఎమ్మెల్యేను స్థాయి మరిచి ఏక వచనంలో సంబోధించటం సిగ్గు పడాల్సిన విషయమన్నారు. నక్క, పులి అన్నట్లుగా కొందరు నాయకులు విమర్శించటంపై ఆయన స్పందిస్తూ జరిగిన ఎన్నికల్లో ఎవరు పులో, ఎవరు నక్కో ప్రజలే తేల్చి చెప్పారన్నారు. కొందరు నాయకులు ల్యాండ్, స్యాండ్, వైన్ అంటూ మాట్లాడటం దారుణమన్నారు. ఎవరు ఇసుక లారీల వద్ద డబ్బులు వసూల్ చేస్తున్నారో, ఎవరు బ్రాందీ షాపుల వద్ద మామూళ్లకు పాల్పడుతున్నారో తెలుసన్నారు. దోర్నాలకు ముగ్గురు మంత్రులు వచ్చినప్పుడు ఎంతమంది జనం వచ్చారో, మండల స్థాయిలో జరిగిన సభకు ఎంత మంది జనం వచ్చారో ప్రజలకు తెలుసన్నారు. ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎన్ని నిధులు, ఎక్కడెక్కడి నుంచి సేకరించారో అందరికీ తెలుసన్నారు. టీడీపీ చెందిన కొందరు నాయకులు మాట్లాడుతూ తమ ఇన్‌చార్జి ఇప్పుడు ఉన్న వ్యక్తి కాదని, కొత్తగా మరో నేత వస్తున్నాడని ప్రచారం చేయడం ప్రస్తుత నేతకు మీరు ఇస్తున్న గౌరవం ఏ పాటిదో అర్థమవుతోందన్నారు. ఎమ్మెల్యే తాటిపర్తి హైదరాబాద్ నుంచి వస్తుంటారని వ్యాఖ్యానించటం సరికాదన్నారు. టీడీపీ నాయకులు ఎంతమంది హైదరాబాద్, మార్కాపురం నుంచి రావడం లేదని రమణారెడ్డి ప్రశ్నించారు. సమావేశంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు యలకపాటి పెద్ద లక్ష్మయ్య, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు బాలాజీనాయక్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు రామారావు, బూత్ కమిటీ అధ్యక్షుడు గుండారెడ్డి రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి మండ్లా రమణ పాల్గొన్నారు.